క్లుప్తంగా

నీలమణిదుర్గ అమ్మవారికి అన్నాభిషేకం


అమ్మవారి విగ్రహం వద్ద అన్నం రాశి

సారవకోట: మండలంలోని అవలింగి నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని సోమవారం శాకంబరి దేవిగా అలంకరించారు. ఆషాఢమాసం పురస్కరించుకుని అమ్మ వారి విగ్రహాన్ని వివి ధ రకాల డ్రైఫ్రూట్స్, పుష్పాలతో అలంకరించి, అన్నంతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మురుగునీరు మళ్లించాలని వినతి


డీటీ సరితకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నరసన్నపేట: మండలంలోని బొరిగివలస ప్రాంతంలో వంశధార కాలువల్లోకి నరసన్నపేట టౌన్‌కు చెందిన మురుగునీరు వస్తోందని, దీంతో పంట కాలువలన్నీ కలుషితం అవుతున్నాయని, మురుగు నీటిని దారిమళ్లించాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సరితకు బొరిగివలసకు చెందిన రైతులు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వంశధార కార్యాలయానికి వెళ్లి అధికారులను కలిసి సమస్య వివరించారు. జంగిల్ బాగా పెరిగి నీటి సరఫరాకు ఆటంకం కలిగిస్తుందన్నారు.

ఇళ్ల మధ్య ప్రైవేట్ స్కూల్ వద్దు

నరసన్నపేట: స్థానిక మారుతీ నగర్‌లో ఇళ్ల సాముదాయాల మధ్య ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం స్కూల్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుందని, దీనిని ఆపాలని ఆ వీధి వాసులు స్కూల్ భవనం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానికుడు జామి వెంకటరావు మాట్లాడుతూ.. ఇప్పటికే డీఈఓతోపాటు ఇతర అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా స్కూల్ యాజమాన్యం స్థానికుల నిరసనల మధ్య వసతి గృహం, తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుందన్నా రు. మారుతీనగర్‌కు చెందిన మహిళలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని ఉర్లాం జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించి ప్లాస్టిక్ భూతం వల్ల కలిగే ప్రమాదాలు, పర్యావరణానికి ఎలా ముప్పు కలుగుతుందనేది వివరించారు. ఉర్లాంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.10 వేల ఆర్థికసాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు కృపానందం

మెళియాపుట్టి: మండలంలోని బందపల్లి గ్రామానికి చెందిన పాస్టర్ సవర సుక్కు భార్య వరహాలమ్మ ఇటీవల మృతి చెందారు. జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ తరఫున సోమవారం రూ.10 వేలను జిల్లా అధ్యక్షుడు కృపానందం అందజేశారు. ఇదివరకే వారు నిర్ణయించుకున్నట్లుగా పాస్టర్ల కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే ఆదుకోవాలనే ఆలోచనలతోనే ఈ సహాయం చేశామన్నారు. అసోసియేషన్ సెక్రెటరీ సాల్మన్, జాయింట్ సెక్రెటరీ ఎం.వి.జోసెఫ్, ట్రెజరీ ఎస్.విచిత్రో తదితరులు పాల్గొన్నారు.

7న కౌన్సెలింగ్

పాతపట్నం: భామిని, మెళియాపుట్టి గిరిజన సంక్షేమ ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9వ తరగతుల మిగులు సీట్లకు ఈ నెల 7వ తేదీన ఉదయం 11 గంటలకు భామిని ఏకలావ్య గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు మెళియాపుట్టి ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలకు హాజరైన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

అన్నంపేటలో పారిశుద్ధ్య పనులు

బూర్జ: మండలంలోని అన్నంపేట గ్రామంలో పారిశుద్ధ్య పనులు సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ నిధులు సుమారు రూ.4 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడి కిరణ్‌కుమార్, మామిడి ఆదినారాయణ, కొరికాన శంకరరావు తెలిపారు.

• భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

గురుపౌర్ణమి పురస్కరించుకుని షిర్డీసాయి ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, జల, పుష్పాభిషేకాలు చేపట్టారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సత్సంగ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. - సాక్షి నెట్‌వర్క్


నరసన్నపేట: వేంకటేశ్వరాలయంలో లలితా సహస్ర నామ పారాయణం చేస్తున్న హరే శ్రీనివాస భక్త బృందం


మెళియాపుట్టి: చాపరలో రాజరాజేశ్వరీ పీఠంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


సారవకోట: కిన్నెరవాడ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద ప్రవచనాలు చెబుతున్న ఆధ్యాత్మికవేత్తలు


పాతపట్నం: పాతపట్నం షిర్డీ గిరిపై ఉన్న మందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


హిరమండలం: పెద్దకోరాడ షిర్డీసాయి ఆలయంలో కలశ పూజలు నిర్వహిస్తున్న భక్తులు


నరసన్నపేట: కలివరపుపేట షిర్డీసాయి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఆమదాలవలస రూరల్: కట్యాచార్యులపేట షిర్డీ సాయి ఆలయం వద్ద నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్న భక్తులు


ఆమదాలవలస: వంశధార కాలనీలోని షిర్డీ సాయి మందిరంలో లైన్‌లో వేచి ఉన్న భక్తులు

సంతాపం..


మాజీ సర్పంచ్ అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే కృష్ణదాస్

సారవకోట: బద్రి మాజీ సర్పంచ్ మెండ బాల సూర్యప్రసాదరావు ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సోమవారం బద్రి గ్రామం వెళ్లారు. మాజీ సర్పంచ్ అంత్యక్రియల్లో పాల్గొని సంతాపం తెలిజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు వరుదు దేవీ ప్రసాద్, పలువురు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

తాడివలస కార్యదర్శికి స్థానచలనం

పొందూరు: మండలంలోని తాడివలస పంచాయతీ కార్యదర్శి డి.వెంకటరావు స్థానంలో పెనుబర్తి సచివాలయం కార్యదర్శి ఎల్.నాగరాజుకు అదనపు బాధ్యతులు అప్పగించినట్లు ఎంపీడీఓ హరిహరరావు తెలిపారు. వెంకటరావు నిర్లక్ష్యం కారణంగా తాడివలసలో మహిళలే రోడ్లు, కాలువలు ఇటీవల శుభ్రం చేశారనే విషయంపై ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు కార్యదర్శిని మార్చినట్లు తెలిపారు. సోమవారం గ్రామంలో పర్యటించి మహిళలు చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

హుండీ ఆదాయం లెక్కింపు


కానుకలను లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణ గ్రామదేవత పాలపోలమ్మ తల్లి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నూతనంగా ఏర్పాటు అయిన ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆలయంలో 5 హుండీలు ఉండగా.. ఇందులో మూడు హుండీల్లోని కానుకలను లెక్కించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కూన బాలకృష్ణ తెలిపారు. రూ.1,01,380ల ఆదాయం వచ్చిందని, ఈ మొత్తాన్ని ఆలయ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. కొన్ని అనివార్య కారణాలవల్ల మిగతా హుండీల లెక్కింపు జరగలేదన్నారు. వీటిని కూడా లెక్కించి ఆ మొత్తాన్ని కూడా చెబుతామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు జె.కె. వెంకటేశ్వరరావు, దుంపల శ్యామలరావు, కూన రామకృష్ణ, అయ్యప్ప, బలివాడ రాజేష్ పంతులు, గుండ్ల బాబు, కె.శ్రీనివాసరావు, వేదపండితుడు ప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా రేషన్ డీలర్ల కార్యవర్గం ఎన్నిక


రేషన్ డీలర్ల కార్యవర్గం సభ్యులు

హిరమండలం: మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో రేషన్ డీలర్ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొడబ అప్పారావు, ఉపాధ్యక్షుడిగా కొప్పురౌతు స్వర్ణలత, ప్రధాన కార్యదర్శిగా లాడి బలరాంను ఎన్నుకున్నారు. రేషన్ డీలర్ల సమస్యలపై ఈ సందర్భంగా చర్చించారు. రేషన్ డీలర్ల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.

ఎరువుల పంపిణీ

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట రైతు భరోసా కేంద్రం వద్ద మండల వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ సోమవారం ఎరువులు పంపిణీ చేశారు. ఇప్పటికే మొదటి విడతగా వచ్చిన 20 మెట్రిక్ టన్నుల డీఏపీని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మొదటి విడత ఎరువులు పంపిణీ పూర్తిచేసిన వెంటనే ఆదే రైతు భరోసా కేంద్రానికి రెండో విడత ఎరువులు వస్తాయన్నారు. ఎరువులు కోసం రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేకుండా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ వ్యాపారులు కూడా ప్రభుత్వ ధర ప్రకారమే ఎరువులు విక్రయించాల్సి ఉంటుందన్నారు. అధిక ధరలకు విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అధికారుల సమక్షంలోనే ప్రభుత్వ ధరలకు విక్రయించేలా చర్యలు తీసుకుంటామని ఏఓ వివరించారు.

ఆ బోరు నీరు తాగవద్దు


ఫ్లోరైడ్ నీరుగా నిర్ధారించిన బోరు

సరుబుజ్జిలి: మండలంలోని మూలసవలాపురం పంచాయతీ వ్యాసులుపేటలో గల బోరు నీటిని ఫ్లోరైడ్‌గా అధికారులు తనిఖీల్లో తేలింది. ఆ బోరు నీటిని గత సంవత్సర కాలంగా తాగినవారికి కాళ్లచేతులు నొప్పులు, విషజ్వరాలు, గుండె సంబంధిత వ్యాధులు వచ్చాయి. ఇదే విషయాన్ని సంబంధిత శాఖాధికారులు దృష్టికి తెచ్చినా ఫ్లోరైడ్‌కాదని కొట్టిపారేశారు. ఇటీవల పలు పత్రికల్లో వచ్చిన కథనాల మేరకు అధికారులు నీటినాణ్యత తనిఖీ కోసం పంపించగా.. ఫ్లోరైడ్‌గా నిర్ధారణ జరిగిందని, ఆ నీటిని తాగవద్దని ఎంపీడీఓ మురళీమోహన్ తెలియజేసినట్లు గ్రామస్తులు బెండి రాంబాబు, బెండి శ్రీనివాసరావు, శ్యామలరావు వెల్లడించారు.

పశు ఆరోగ్య వాహన సేవలు వినియోగించుకోవాలి


పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1లో పశు ఆరోగ్య సేవ వాహన శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. పాడి రైతులకు ఆదుకోవడానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంచార పశువైద్య సేవా వాహనాలను తీసుకువచ్చారన్నారు. వాహనాల ద్వారా మూరుమూల గ్రామాలకు వెళ్లి పశు వైద్య సేవలు అందివ్వడం జరుగుతుందన్నారు. శిబిరంలో 25 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి, పశు ఆరోగ్య సేవ వాహన సిబ్బంది పాల్గొన్నారు.

• జగనన్న సురక్షతో ఉచిత సేవలు

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వమే ఉచితంగా 11 రకాల సేవలను ప్రజలకు అందజేస్తుందని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. - సాక్షి నెట్‌వర్క్


ఆమదాలవలస రూరల్: నిమ్మతొర్లాడలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం, అధికారులు


సరుబుజ్జిలి: రొట్టవలసలో ధ్రువపత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్


ఎల్.ఎన్.పేట: బొత్తాడసింగిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


ఆమదాలవలస: కృష్ణాపురంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్


పాతపట్నం: తిడ్డిమిలో ధ్రువపత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు


పోలాకి: డీఎల్‌పురంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య

పేదల జీవితాల్లో వెలుగులు

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన


ఆమదాలవలస రూరల్: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థతో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని వంజంగి గ్రామ పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందినవారికి కరపత్రాలను పంపిణీ చేశారు. సాంకేతికపరమైన కారణాలతో అర్హులు సంక్షేమానికి దూరం కాకుండా చూడాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. సచివాలయ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, సర్పంచ్ బెండి సత్యవతి, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గురుగుబెల్లి నీలారావు, పొన్నాడ రాము, చిగురుపల్లి దశరథ, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఏఓ మెట్ట మోహనరావు, ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చంద్రమౌళి, ఏపీఎం పైడి కూర్మారావు, పంచాయతీ కార్యదర్శి స్టాలిన్, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.


పొందూరు: తాగునీటి కుళాయిలు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు

పొందూరు: నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే జల్‌జీవన్ మిషన్ పథకం ఉద్దేశమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని లైదాం, కొల్లిపేట గ్రామాల్లో రూ.82 లక్షల అంచనాల నిధులతో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి కుళాయిల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. పేదప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ సునీల్‌కుమార్, స్థానిక నాయకులు జమ్మినాయుడు, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను వినియోగించుకోవాలి

కొత్తూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని పారాపురం ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ అన్నారు. కొత్తూరులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందని కుటుంబాలను గుర్తించి, పథకాలు మంజూరుకు అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్తం అవసరమైన కులం, ఆదాయ ధ్రువపత్రాలు అక్కడకక్కడే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు న్యాయం చేయాలన్న ఆలోచనతో జగనన్న సర్క్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గండివలస ఆనందరావు, పంకజదాస్, బి.రామకృష్ణ ఉన్నారు.

నేడు పింద్రువాడ, మహలక్ష్మీపురంలో..

హిరమండలం: మండలంలోని పింద్రువాడ, మహలక్ష్మీపురం సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రత్యేక శిబిరాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఏపీ సురేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ సోమవారం ఇక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

మెళియాపుట్టిలో..

మెళియాపుట్టి: జగనన్న సుర్క్ష ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలు, ఎటువంటి రుసుం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని ఎంఎల్‌ఓ రేవంత్ అన్నారు. మండలంలోని కొసమాల, వసుంధర, సిరియాఖండి గ్రామ సచివాలయాలలో ఈ కార్యక్రమంపై ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. మండల ప్రత్యేకాధికారి భవానీశంకర్, ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పొందూరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, దీనిపై ఏపీటీఎఫ్ నిరంతర పోరాటాలు చేస్తోందని ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రమణరావు, డి.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని ఒకటో నంబర్ ప్రాథమిక పాఠశాలలో ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సీపీఎస్, పీఆర్సీ ఎరియర్స్‌పై చర్చించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.విజయకుమార్, నాయకులు పాల్గొన్నారు.

బుడితి సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా వినోద్‌కుమార్


వినోద్‌కుమార్

సారవకోట: మండలంలోని బుడితి సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వెలమల వినోద్‌కుమార్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ గైనకాలజిస్టుగా విధులు నిర్వహించిన సృజనీకుమారి ఇటీవల బదిలీపై పొందూరు వెళ్లారు. ఇక్కడ సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ఉన్న వినోద్‌కుమార్‌కు సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించారు.

ఘనంగా వరల్డ్ మెకానిక్ డే


కేక్ కట్ చేస్తున్న సీఐ వేణుగోపాలరావు

కొత్తూరు: మెకానిక్ విద్య ద్వారా యువత స్వయం ఉపాధి పొందవచ్చని స్థానిక సీఐ ఆర్.వేణుగోపాలరావు అన్నారు. కొత్తూరులో సోమవారం విజయదుర్గా మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ మెకానిక్ డే ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. యువత చదువు పూర్తిచేసిన తరువాత ఖాళీగా ఉండకుండా అన్ని రకాల మెకానిక్‌లు నేర్చుకోవడం వల్ల సొంత గ్రామంలోనే స్వయం ఉపాధి పొందగలరన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు అగతమూడి భాస్కరరావు, చంద్రరరావు, పైల భాస్కరరావు, లక్ష్మణరావు, రమేష్, కె.వెంకటరమణ, సీహెచ్ భాస్కరరావు పాల్గొన్నారు.